క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఈవో రమేష్‌నాయుడు తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రీడింగ్‌రూమ్ వద్ద చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కొణతాల శ్రీనివాస్

దాబాగార్డెన్స్: శ్రీగాయత్రిదేవి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొణతాల అప్పారావు జ్ఞాపకార్థం జీవీఎంసీ 38వ వార్డు రీడింగ్ రూమ్ వద్ద శుక్రవారం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు కొణతాల శ్రీనివాస్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ట్రస్టును 2008లో ప్రారంభించామని, వైద్య, రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు, పేద విద్యార్థులకు ఉచితంగా పుస్తకాల పంపిణీ, విద్యార్థులకు ఉచిత విద్య, వస్త్ర దానం తదితర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని నియోజకవర్గ పరిధి ప్రతి వార్డులో ముఖ్యమైన జంక్షన్ల వద్ద చలివేంద్రాలు ప్రారంభించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సీహెచ్ వెంకటేశ్వరరావు, కొయ్య రామకృష్ణ, పిల్లి నూకరాజు, సురేష్ తదితరులు పాల్గొని మజ్జిగ పంపిణీ చేశారు.

'మోదీ ప్రభుత్వానికి పతనం తప్పదు'

సీతమ్మధార : ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపకపోతే మోడీ ప్రభుత్వానికి పతనం తప్పదని సీఎఫ్‌టీయూఐకి చెందిన పలువురు మహిళా కార్మికులు హెచ్చరించారు. అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు 753వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖతో పాటు రాష్ట్రవ్యాప్తంగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున్న ఉద్యమం జరుగుతున్నా మోడీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

7 కరోనా కేసులు నమోదు

మహారాణిపేట: విశాఖలో శుక్రవారం ఏడు కరోనా కేసులు నమోదయ్యాయి. 24 గంటల్లో 244 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో ఏడుగురికి కరోనా నిర్ధారణ అయింది. దీంతో మొత్తం కరోనా సోకిన వారి సంఖ్య 30కి చేరింది. 13 మంది డిశ్చార్జ్ అయ్యారు. 30 మంది చికిత్స పొందుతున్నారని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు.

11 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

అల్లిపురం: బహిరంగంగా పేకాట ఆడుతున్న 11 మంది పేకాటరాయుళ్లను మహారాణిపేట పోలసులు, సిటీ టాస్క్‌ఫోర్సు పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ. 25 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామజోగిపేట వద్ద కొంత మంది వ్యక్తులు బహిరంగంగా పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి వారిని రిమాండ్‌కు తరలించారు.

వడదెబ్బతో తస్మాత్ జాగ్రత్త

- తక్షణమే వైద్యులను సంప్రదించాలి
- ఎండలో తిరగడం మానుకోవాలి
- ద్రవ పదార్థాలు తీసుకోవాలి

దాబాగార్డెన్స్ : ఈ ఏడాది ఎండాకాలం నెలన్నర ముందుగానే వచ్చింది. వడగాడ్పులు కూడా అదే స్థాయిలో ఉన్నాయి. ఈ దశలో వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉండే చిన్నపిల్లలు, వృద్ధులు ఇబ్బంది పడే పరిస్థితులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వడదెబ్బకు గురి కాకుండా ముందస్తు జాగ్రత్తలు, గురయ్యాక తీసుకోవల్సిన తక్షణ చర్యలపై వైద్యరంగ నిపుణుల సూచనలు గమనిద్దాం.

- వడదెబ్బకు గురైన వారి శరీర ఉష్ణోగ్రత 104 డిగ్రీల ఫారన్‌హీట్‌కు చేరుకుంటుంది. అయితే చాలా మంది దీనిని వడదెబ్బగా కాకుండా జ్వరంగా భావించి నిర్లక్ష్యం చేస్తుంటారు. అలా చేస్తే ప్రాణాంతకమయ్యే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.
- వడదెబ్బ సోకిన వారిని వెంటనే చల్లని ప్రదేశానికి చేర్చాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థితికి వచ్చే వరకు చల్లని ప్రాంతంలో ఉంచాలి. చల్లని నీరు తాగడం వల్ల త్వరగా శరీర ఉష్ణోగ్రత తగ్గుముఖం పడుతుంది. బాత్ టబ్‌లో 5 నుంచి 10 నిమిషాలు గడపాలి. లేదా చల్లని దుప్పటిని శరీరమంతా కప్పాలి. ఐస్ ముక్కలతో శరీరమంతా అద్దాలి. ఇలా చేస్తే శరీరం వణుకు తగ్గుతుంది. కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం కలుగుతుంది.



తీవ్రతను బట్టి ఆలస్యం చేయకుండా వైద్యుని వద్దకు తీసుకెళ్లాలి. ఎక్కువగా తాజా పండ్లు, కూరగాయలు తినాలి. అదనంగా ద్రవపదార్థాలు, పండ్ల రసాలు, ఎనర్జీ డ్రింకులు, మజ్జిగ తాగాలి.

వడదెబ్బ..లక్షణాలు..

రక్త ప్రసరణ తగ్గి, బీపీ డౌన్ అవుతుంది. శరీరంతో పాటు పెదాలు, గోళ్ల రంగు మారతాయి. ఉష్ణోగ్రతలు బాగా పెరుగుతాయి. కీళ్ల నొప్పులు అధికంగా ఉంటాయి. నరాల సమస్యలు ఉత్పన్నమవుతాయి. స్పృహ కోల్పోయే ప్రమాదం ఏర్పడుతుంది. మాట స్పష్టత తగ్గుతుంది. ఇతరులు చెప్పేది వినలేకపోతారు. కొంత మంది కోమాలోకి పోయే ప్రమాదం ఉంది. విపరీతమైన తలనొప్పి వస్తుంది. హృదయ స్పందన బాగా పెరుగుతుంది. శ్వాస తీసుకోవడం కష్టమవుతుంది. చర్మం బాగా కందిపోయి మంటగా ఉంటుంది. బుగ్గలు, మెడ, గొంతు, మోచేతులు, ఛాతీ భాగాలు ఎరుపెక్కుతాయి. శరీరాన్ని తాకితే వేడిగా, పొడిగా ఉంటుంది.

అప్రమత్తత అవసరం..



వడగాడ్పులపై జనం చాలా అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులతో పాటు దీర్ఘకాలిక వ్యాధులు, హృద్రోగం, అదుపులో లేని షుగర్, రక్తపోటు రోగులు, మానసిక రోగానికి మందులు వాడేవారు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తపడాలి. తప్పనిసరై బయటికి వచ్చేవారు కాటన్ దుస్తులు ధరించి, టోపీ లేదా గొడుగు (లైట్‌కలర్)తో వెళ్లాలి. చర్మరోగులు సన్‌స్క్రీన్ లోషన్ రాసుకున్నాకే బయటకు రావాలి. తగినంత నీరు తాగి.. వెంట తీసుకెళ్లాలి. ద్రవాహారం, కొబ్బరినీళ్లు, తాజా పండ్లు, పండ్ల రసాలు (ఐస్ లేకుండా) ఎక్కువగా తీసుకోవాలి. మసాలా లేని ఆహారం మంచిది. వడదెబ్బ తగిలిన వారు కళ్లు తిరిగి పడిపోయినా, స్పృహ కోల్పోయినా, మగతగా ఉన్నా, ఫిట్స్ వచ్చినా, కండరాలు బిగుసుకుపోయినా, మూత్రం తగ్గినా వెంటనే వైద్యుని వద్దకు తీసుకెళ్లాలి. ఈ వేసవిలో అంటువ్యాధులు, డయేరియా వంటివి సోకే ప్రమాదం కూడా ఉంది.

డాక్టర్ అచ్యుతరావు, కేజీహెచ్ వైద్యుడు



పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని నగరంలోని జగదాంబ వద్ద గల మసీదును విద్యుద్దీపాలతో అలకరించిన దృశ్యం

నిబంధనల ఉల్లంఘనపై ఫిర్యాదు చేయండి

దాబాగార్డెన్స్: నగరంలో అనధికార నిర్మాణాలు, నిబంధనలు ఉల్లంఘించిన కట్టడాలు, భవన నిర్మాణ వ్యర్థాలు, టౌన్‌ప్లానింగ్ విభాగంపై ఎలాంటి ఫిర్యాదుల గురించి తెలియజేయాలన్నా జీవీఎంసీ టోల్‌ఫ్రీ నంబరు 1800 4250 0009కు ఫోన్ చేసి నేరుగా సమస్య తెలియజేయవచ్చని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు. జీవీఎంసీ పరిధిలో గల 8 జోన్లలో పట్టణ ప్రణాళిక విభాగంలో అధికంగా వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో జీవీఎంసీ కమిషనర్ టౌన్‌ప్లానింగ్ ఫిర్యాదుల కోసం ప్రతి శుక్రవారం ప్రత్యేకంగా స్పందన కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడంలో భాగంగా చీఫ్ సిటీ ప్లానర్ వి. సునీత ఆధ్వర్యంలో శుక్రవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనధికార నిర్మాణాలు, నిబంధనల ఉల్లంఘన, టౌన్‌ప్లానింగ్‌కి సంబంధించి ఎటువంటి ఫిర్యాదునైనా జీవీఎంసీ టోల్ ఫ్రీ నంబరుకు గానీ, టౌన్‌ప్లానింగ్ విభాగం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 81878 97569 నంబరు వాట్సాప్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీలు, డీసీపీలు, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారి

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కంచరపాలెం: జ్ఞానాపురం డయాస్‌వీధిలో ఉంటున్న ఎర్ర ఏసుబాబు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ దృష్టికి వలంటీర్ రాజు సమస్యను తీసుకెళ్లారు. దీంతో వైఎస్సార్‌సీపీ వార్డు సీనియర్ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్ వైద్యం, ఇంటి ఖర్చుల నిమిత్తం అతని భార్య ఎర్ర రమణమ్మకు శుక్రవారం రూ.5వేలు నగదును అందించారు.



రమణమ్మకు నగదును అందిస్తున్న కోడిగుడ్ల శ్రీధర్

స్ఫూర్తి నింపే సివిల్ సర్వీసెస్ డే

మహారాణిపేట : ప్రభుత్వ ఉద్యోగులను గుర్తించి, వారిలో స్ఫూర్తి నింపేందుకే జాతీయ సివిల్ సర్వీసెస్ రోజును ప్రతి ఏడాది ఏప్రిల్ 21వ తేదీన జరుపుకుంటున్నామని జిల్లా జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 16వ జాతీయ సివిల్ సర్వీసెస్ రోజును ఘనంగా నిర్వహించారు. దేశంలోని వివిధ పబ్లిక్ సర్వీస్ విభాగాల్లో నిమగ్నమై ఉన్న అధికారుల పనిని గుర్తించేందుకు ప్రతి సంవత్సరం ఏప్రిల్ 21న దీనిని పాటిస్తారన్నారు. అనంతరం 16వ జాతీయ సివిల్ సర్వీసెస్ రోజు సందర్భంగా అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగుల చేత జాయింట్ కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. డీఆర్వో శ్రీనివాసమూర్తి, సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ రమణ మూర్తి, కలెక్టరేట్ పరిపాలన అధికారి ఈశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉద్యోగుల చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న జేసీ విశ్వనాథన్

పదేళ్లు దాటితే ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి

మహారాణిపేట: ఆధార్ కార్డు తీసుకుని పదేళ్లు దాటితే కచ్చితంగా అప్‌డేట్ చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి అన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ రెండో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ కార్డు ద్వారా బ్యాంక్ ఖాతా, సిమ్ కార్డ్, వివిధ ఉపకార వేతనాలు, ఆదాయపు పన్ను, బ్యాంకు రుణాలు, ఒక దేశం ఒక రేషన్ కార్డు కింద దేశంలో ఎక్కడైనా సరుకులు పొందేందుకు అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను నవీకరించిన ఆధార్‌తో పొందవచ్చని ఆధార్ కార్డులను అప్‌డేట్ చేసుకోవాలని ఆయన సూచించారు. దీని కోసం ఏదైనా అడ్రస్ ప్రూఫ్ , ఐడెంటిటీ ప్రూఫ్‌తో దగ్గరలోని ఆధార్ కేంద్రం, మండల ప్రధాన కేంద్రంలోని సచివాలయం, బ్యాంకులు, పోస్ట్ ఆఫీస్, వ్యక్తిగతంగా ఆన్‌లైన్‌లో గాని అప్‌డేట్ చేసుకోవచ్చన్నారు. జూన్ నెల 14వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఆధార్ అప్‌డేట్ ఉచితమని పేర్కొన్నారు. అడ్రెస్ ప్రూఫ్ లేనట్లయితే వారి సచివాలయం లో 20/- చెల్లించి సర్టిఫికెట్ పొందవచ్చని తెలిపారు . జిల్లాలో ఇంకా ఆధార్ అప్ డేట్ చేసుకోని వారు సుమారు 4 లక్షల మంది ఉన్నారన్నారు. ఆధార్ అప్ డేట్‌కు సంబంధించిన సమాచారం, వివరాలకు టోల్ ఫ్రీ నెంబర్ 1947 వినియోగించుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఎల్డివో పూర్ణమా దేవి, జెడ్పీ డిప్యూటీ సీఈవో సత్యనారాయణ, యూఐడీఏఐ రీజినల్ మేనేజర్ గిరిధర్, వైద్య ఆరోగ్య శాఖ, బ్యాంకింగ్, పోస్టల్,ఎడ్యుకేషన్, బీఎస్ఎన్ఎల్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్వో శ్రీనివాస మూర్తి

జోరుగా జగనన్నే మా భవిష్యత్తు



పందా వీధిలో ప్రభుత్వ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న కనకరెడ్డి



గృహిణికి ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న బోణి దేవ



తన ఇంటికి సీఎం స్టిక్కర్ అంటిస్తున్న మహిళ

జగదాంబ: శుక్రవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం 35వ వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి అధ్వర్యంలో నిర్వహించారు. పండావీధి, ప్రసాద్‌గార్డెన్స్ ప్రాంతాల్లో వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలతో కలసి కనకరెడ్డి లబ్ధిదారులతో మాట్లాడారు. పథకాలు అందుతున్నాయా? అని ప్రశ్నించారు. ఇంటింటికీ స్టికర్లు అతికించారు. క్లష్టర్ ఇన్‌చార్జి కర్రి నీలకంఠం, సచివాలయ కన్వీనర్ రమాదేవీ, బుజ్జి, శివ, రమణ, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

పలు వార్డుల్లో..

దాబాగార్డెన్స్: మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం శుక్రవారానికి 15వ రోజుకి చేరింది. జీవీఎంసీ 28, 29, 30, 37 వార్డుల క్లష్టర్-4 ఇన్‌చార్జి పీతల వాసు నేతృత్వంలో అంగటిదిబ్బ, పందిమెట్ట, పెయిందొర పేట, వేంకటేశ్వరనగర్, వెంకటపతిరాజునగర్ సచివాలయాల పరిధిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. వార్డు పరిధి పలు ప్రాంతాల్లో కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో కలిసి ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లు అంటించారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు వివరించారు. సచివాలయ కన్వీనర్లు, ఆర్కే బీచ్ వర్తక సంఘం అధ్యక్షుడు సీహెచ్ రమణ, కనక రాజు, సీలాపు లక్ష్మి, కోరాడ సురేష్, బెవర మహేష్, అడపా శివ, గండి అప్పలరాజు, గండి పద్మ, ఆరుగుల రాజ్ కుమార్ పాల్గొన్నారు.

32వ వార్డులో..

అల్లిపురం: జీవీఎంసీ 32వ వార్డులో దక్షిణ నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోణి దేవ ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేశారు. ప్రతి ఇంటికి స్టిక్కర్ అంటించి, వారితో మిస్డ్ కాల్ చేయించి, ప్రభుత్వ పథకాలను వివరించారు. ఆయనతో పార్టీ గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వాసుపల్లి ఔదార్యం

అల్లిపురం: శుక్రవారం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ జీవీఎంసీ 34వ వార్డు అచ్చియ్యమ్మపేట జంక్షన్‌లో గల డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద, జామియా మసీదు వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించి, పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, జేసీఎస్ ఇన్‌చార్జి కర్రి నీలకంఠం, పార్టీ సీనియర్ నాయకులు లండా రమణ, లింగం శ్రీనివాసరావు, దూడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ఆపదలో ఉన్నామని విన్నవించుకున్న ముగ్గురికి రూ.10 వేలు ఆర్థిక సహకారం అందజేశారు. 31వ వార్డు దాబాగార్డెన్స్‌కు చెందిన సత్యంశెట్టి శ్రీనుకు రూ.5వేలు, 34వ వార్డు కొబ్బరితోటకు చెందిన పెద్దాడ అప్పారావుకు రూ.2,500, 38వ వార్డు బుక్కావీధికి చెందిన శెట్టి ధనరాజ్‌కు రూ.2,500, మరో పేద మహిళకు రూ.500 అందజేసి ఔదార్యం చాటుకున్నారు.



అచ్చియ్యమ్మపేటలో మహిళకు ఆర్థిక సాయం చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

నిత్యాన్నదాన పథకానికి రూ. లక్షా 1,116 విరాళం



విరాళం అందజేస్తున్న భక్తులు

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి నగరానికి చెందిన ఎ. రాందాస్ రూ.లక్షా వెయ్యి నూట పదహారు విరాళాన్ని శుక్రవారం ఆలయ ఏఈవో వెంపలి రాంబాబుకు అందజేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు, వేద ఆశీర్వచనం అనంతరం ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాయి మందిరంలో ఘనంగా ఇఫ్తార్ విందు

అగనంపూడి: పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా అగనంపూడి సాయిబాబా ఆలయంలో శుక్రవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మసీద్ ఈ అబూబర్ అధ్యక్షుడు మీరా మొహిద్దీన్ మాట్లాడుతూ మతాల ప్రమేయం లేకుండా హిందూ, ముస్లింలు సఖ్యతతో సోదర భావంతో మెలుగుతూ దేశ సమగ్రతను కాపాడుకుంటున్నామన్నారు. సాయి మందిర కమిటీ ప్రతీ ఏటా ఇఫ్తార్ విందు ఏర్పాటు సంప్రదాయంగా కొనసాగడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం మీరా మొహిద్దీన్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కె.వి.రమణారెడ్డి, నాయకులు బి.సత్యనారాయణ, కమిటీ ప్రతినిధులు డి.వ్యాస శర్మ, జి.శంభుడు, పి.సత్యనారాయణ, సత్యవతి, లీలావతి, పంకజం తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ సందర్భంగా ముస్లిమ్ పెద్దలను సత్కరిస్తున్న సాయి మందిరం ప్రతినిధులు

రంజాన్ తోఫా పంపిణీ



ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కంచరపాలెం: జ్ఞానాపురం పార్టీ కార్యాయలంలో ముస్లిం సోదరులకు వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి యాండ్రపు నిఖిలేష్ రాజ్‌కుమార్ శుక్రవారం రంజాన్ తోఫా పంపిణీ చేసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గవర రమణ, గుజ్జల ప్రమీల, దుప్పాడ దాస్, దాలిబోయిన మధు, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

కర్ణాటక ఎన్నికల పర్యవేక్షకురాలిగా లక్ష్మి

దాబాగార్డెన్స్: కర్ణాటకలో వచ్చే నెల 10న నిర్వహించే అసెంబ్లీ ఎన్నికలకు రాయచూర్ పార్లమెంట్‌లో గల అన్ని అసెంబ్లీ స్థానాలకు మహిళా కాంగ్రెస్ పర్యవేక్షకురాలిగా కూచి లక్ష్మి నియమితులయ్యారు. ప్రస్తుతం గ్రేటర్ విశాఖ నగర కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలిగా ఆమె పార్టీకి సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాయచూర్ పార్లమెంట్ అన్ని అసెంబ్లీ స్థానాల పర్యవేక్షకురాలిగా తనను నియమించిన అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నట్టా డిసౌజా, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.



కూచి లక్ష్మి

వేడుకగా జాతీయ పీఆర్ దినోత్సవం

దాబాగార్డెన్స్: భారత ప్రజా సంబంధాల సంఘం (పీఆర్ఎస్ఐ) విశాఖ శాఖ ఆధ్వర్యంలో జాతీయ ప్రజా సంబంధాల దినోత్సవం శుక్రవారం నగరంలోని ఓ హోటల్లో నిర్వహించారు. పీఆర్ఎస్ఐ విశాఖ శాఖ చైర్మన్ డాక్టర్ పీఎల్‌కే మూర్తి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో దక్షిణ భారతదేశ ఉపాధ్యక్షుడు యూఎస్ శర్మ, స్టీల్‌ప్లాంట్ కార్పొరేట్ కమ్యూనికేషన్స్ విభాగ అధిపతి ఆర్‌పీ శర్మ, కార్యదర్శి ఎ. గోవిందరావు, సహాయ కార్యదర్శి ఎంకేవీఎల్ నరసింహం, చాప్టర్ పూర్వ అధ్యక్షుడు ఆచార్య డీవీఆర్ మూర్తి, ప్రముఖ ఆర్థిక శాస్త్ర నిపుణుడు, విక్రమసింహపూరి విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఆర్. సుదర్శనరావు పాల్గొన్నారు. జాతీయ ప్రజా సంబంధాల దినోత్సవంలో భాగంగా కాకినాడ నాగార్జున ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ పరిశ్రమలో పీఆర్ మేనేజర్‌గా సేవలందిస్తున్న వారణాశి రవికుమార్, సింహాచలం దేవస్థానం ప్రజాసంబంధాల అధికారిగా వ్యవహరిస్తున్న వీసంశెట్టి అప్పలనాయుడు వృత్తి నైపుణ్యాలు గుర్తిస్తూ ఉత్తమ పీఆర్‌వో అవార్డుతో సత్కరించారు. మేజిక్ కార్యక్రమాలు నిర్వహిస్తున్న చొక్కాకుల వెంకటరమణను సన్మానించారు.

'చేసిన పనులకు బిల్లులు ఇప్పించండి'

దాబాగార్డెన్స్: చేసిన పనులకు బిల్లులు ఇప్పించాలని ఎస్సీ, ఎస్టీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నాయకులు శుక్రవారం జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మను కలిసి వినతిపత్రం అందజేశారు. జీవీఎంసీ కమిషనర్‌ను రావాడ సీతారాం, అప్పన్న,ఆంజనేయలు మర్యాదపూర్వకంగా కలిసి సమస్య మొర పెట్టుకున్నారు. సొసైటీలకు బ్యాంకు రుణాలు రానందున అసోసియేషన్ సభ్యులు చేసిన పనులకు బిల్లలు ఇప్పించాలని వేడుకున్నారు.



కమిషనర్‌ను కలిసిన ఎస్సీ, ఎస్టీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు

ఆశీలు వేలం పాటలో కాంట్రాక్టర్ల కుమ్మక్కు?

- రూ.62.56 లక్షలకే ముగించేసిన వైనం

జగదాంబ: పూర్ణామార్కెట్ (సర్దార్ వల్లభాయ్ పటేల్ మార్కెట్) ఆశీలు వేలం పాటలో కాంట్రాక్టర్లు కుమ్మక్కయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకే తక్కువ ధరావత్తుకు వేలం పాట ఖరారైనట్లు ప్రచారం జరుగుతోంది. జీవీఎంసీ జోన్-4 పరిధిలో పూర్ణామార్కెట్, రామకృష్ణ రైతుబజార్ పెద్ద మార్కెట్లు. ఏటా జోనల్ కార్యాలయంలో ఆశీలు వేలం పాట నిర్వహిస్తారు. గతేడాది పూర్ణామార్కెట్ ఆశీలు పాట వేలం రూ.87.20 లక్షలకు ఖరారు కాగా.. జీఎస్టీ, స్వచ్ఛభారత్ ట్యాక్స్ కలిపి మొత్తం రూ.1.20 లక్షలు వరకు అయింది. ఈ ఏడాది కనీస మొత్తం కలిపి రూ.80 లక్షలకు కూడా వెళ్లకుండా పాటను పదే పదే వాయిదా వేయించారు. చివరికి గురువారం జరిగిన పాటలో రూ.62.56 లక్షలకు ఖరారైంది. ఈ ప్రక్రియ అంతా కేవలం 15 నిమిషాల్లో జరిగిపోవడం విమర్శలకు తావిస్తోంది. పైగా రాత్రికి రాత్రే కాంట్రాక్ట్‌ను అప్పగించేందుకు జోనల్ కార్యాలయంలో పేపర్లు సిద్ధం చేసినట్లు తెలిసింది. అలాగే స్టాండింగ్ కమిటీ సమావేశంలో టేబుల్ అజెండా కింద పాస్ చేయించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. రామకృష్ణ రైతు బజార్ వేలం పాట కూడా తక్కువ ధరావత్తుకే వెళ్లింది. దీనిపై జీవీఎంసీ ఉన్నతాధికారులు విచారణ చేపట్టి.. వేలం పాట మళ్లీ నిర్వహించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.